క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు

రేపల్లె రూరల్: పెనుమూడి గ్రామంలో ఉషోదయ పబ్లిక్ స్కూలు విద్యార్థులకు బీజేపీ నాయకులు సోమవారం చేయూతనిచ్చారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను అందజేసి భవిష్యత్తులో విద్యార్థులకు అవసరమయ్యే వసతులను కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పిన్ని సాంబశివరావు, సి.హెచ్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం ఎంపీడీఓగా శ్రీనివాసరావు



కర్లపాలెం: కర్లపాలెం ఎంపీడీఓగా అద్దూరి శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అంతర్ జిల్లాల బదిలీల్లో భాగంగా బాపట్ల జిల్లా కర్లపాలెం మండలానికి బదిలీపై వచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. శ్రీనివాసరావును ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు, గ్రామ కార్యదర్శులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు.

బాపట్ల ఎంపీడీఓగా బాబూరావు



బాపట్ల: బాపట్ల ఎంపీడీఓగా బి.బాబూరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. చేబ్రోలు మండల అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న బి.బాబూరావు బాపట్ల ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'పొలం పిలుస్తోంది' పోస్టర్ల ఆవిష్కరణ



వేమూరు: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరించారు. రేపల్లె డివిజన్ వ్యవసాయాధికారి ఆర్.విజయబాబు మాట్లాడుతూ ఈనెల 24 నుంచి డిసెంబరు 31 వరకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కర్లపాలెం: ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర కథనం ప్రకారం.. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం యాజలి గ్రామానికి చెందిన మరకా రాజు(25) ఇటీవల బాపట్ల నుంచి బైక్‌పై యాజలి వెళ్తుండగా, ప్రమాదవశాత్తూ డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించటంతో ఆదివారం రాత్రి మృతిచెందాడని ఎస్ఐ తెలిపారు. మృతుడి సోదరుడు ఫణీంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవీంద్ర వివరించారు.

27న జాబ్ మేళా

వేమూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 27న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా నైపుణ్య అబివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని వెల్లడించారు. మాస్టర్ మైండ్స్, గోదావరి కో-ఆపరేటివ్ సొసైటీ, సాయి ధరణి రేయాలస్టే కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, పీజీ చదివిన 35 ఏళ్లలోపు అభ్యర్థులు ధ్రువపత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన వాహనదారుడికి గాయాలు

భట్టిప్రోలు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి ముందుగా వెళుతున్న వాహనాన్ని తప్పించబోయి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టాడు. సోమవారం జరిగిన ఈ ఘటనలో అతని కాలు విరిగింది. స్థానికుల కథనం ప్రకారం కొల్లూరు మండలం పోతార్లంకకు చెందిన నాంచారయ్య సోమవారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు నుంచి తన స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. వెల్లటూరు కోత మిషన్ మలుపు వద్దకు వచ్చేసరికి ముందుగా వెళుతున్న వాహనాన్ని క్రాస్ చేసే నేపథ్యంలో విజయవాడ నుంచి వెల్లటూరు మీదుగా రేపల్లె వైపునకు వెళుతున్న కరకట్ట ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో నాంచారయ్య కాలు విరిగింది. నడవలేని నిస్సహాయ స్థితిలో ఉన్న అతడికి స్థానికులు సపర్యలు చేసి ప్రత్యేక వాహనంలో తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.



పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరుగుపందెం పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



భట్టిప్రోలు హైస్కూల్‌లో కబడ్డీలో తలపడుతున్న బాలికలు

ఆనంద ఖేలా

- అట్టహాసంగా స్కూల్ గేమ్స్ మండల స్థాయి పోటీలు
- ఉత్సాహంగా పాల్గొన్న బాలురు
- డివిజన్‌స్థాయికి అర్హత సాధించిన విజేతలకు అభినందనలు



నగరం మండలం అల్లపర్రులో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నగరం/భట్టిప్రోలు/వేమూరు: స్కూల్‌గేమ్స్ మండల స్థాయి ఆటల పోటీలు బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల్లో ఉత్సాహంగా సాగుతున్నాయి. నగరం మండలం అల్లపర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అండర్-17,అండర్-14 విభాగాలలో వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను డివిజన్ స్థాయికి ఎంపిక చేశారు. విజేతలను ఇన్‌చార్జ్ ఎంఈవో పి.లాజర్ అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేశ్వరి, స్కూల్‌గేమ్స్ మండల కన్వీనర్ సీహెచ్ సూరిప్రసాద్ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో అండర్-17 అండర్-14 బాలికల విభాగం ఆటల పోటీలు సోమవారం అట్టహాసంగా జరిగాయి. పోటీలను ఎంపీపీ డీవీ లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు టి.ఉదయభాస్కరి, ఎంఈఓ నీలం దేవరాజు ప్రారంభించారు. ఎంఈవో దేవరాజు మాట్లాడుతూ మంగళవారం బాలురకు పోటీలు జరుగుతాయని చెప్పారు. మండలంలోని ఏడు హైస్కూళ్ల నుంచి 140 మంది బాలికలు పోటీల్లో పాల్గొనగా 90 మంది డివిజన్‌స్థాయికి అర్హత సాధించారు. కార్యక్రమంలో హెచ్ఎం సి.రామకోటేశ్వరరావు, స్కూల్ గేమ్స్ మండల కో-ఆర్డినేటర్ చేబ్రోలు శ్రీనివాసరావు, ఆయా హైస్కూళ్ల ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు హరిప్రసాద్, దాసరి వెంకట ప్రసాద్, తుమ్మా శ్రీనివాసరెడ్డి, నాగేశ్వరరావు, పద్మ, లక్ష్మి, అనూల్‌హక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● వేమూరు మండలం పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ అండర్ 14, 17, బాలబాలికల పోటీలు జరిగాయి. విజేతలను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎం.యుగంధర్ అభినందించారు. వ్యాయామ ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రవి రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు

బాపట్ల రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛతాహీ కార్యక్రమం



రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టిన విద్యార్థులు

బాపట్ల/వేమూరు: వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు రైల్వే స్టేషన్ ఆవరణలో సోమవారం స్వచ్ఛతాహీ కార్యక్రమం చేపట్టారు. పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ కె.ఎం.మీనన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కె.లావణ్య, విజయ్‌కుమార్, హేమకుమార్, అశోక్‌కుమార్, పీడీ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు, నిర్మూలనపై వైద్యులు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో అనురాధ, తహసీల్దారు సుశీల, వైద్యాధికారి సయ్యద్ జెరీనా పర్వీన్, శ్రీనివాసరరావు, సిద్దెల రమణ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శివపార్వతి

రేపల్లెరూరల్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ శివ పార్వతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు రావు నెహ్రులక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ మల్లికార్జునరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలి



బాపట్ల: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక విధానాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.మజుందర్ పేర్కొన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం బ్లాక్ డే కార్యక్రమాన్ని చేపట్టారు. రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మజుందర్ మాట్లాడుతూ కార్మికుల హక్కులు పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్ఓకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆశ కార్యకర్తలు అందించారు. నిరసనలో సీఐటీయూ నాయకులు కె.శరత్, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.



కౌకు దెబ్బ

భట్టిప్రోలు ప్రధాన రహదారుల్లో ఆవుల బెడద ఎక్కువైంది. ఫలితంగా ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్లపై ఆవులు అడ్డంగా పడుకోవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కొన్ని సందర్భాల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గాయాల పాలవుతున్నారు. ఒక్కోసారి ఆవులు కొమ్ములతో పొడిచేందుకు యత్నిస్తున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆవుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ ఉషారాణి స్పందిస్తూ ఆవుల యజమానులను పిలిపించి మాట్లాడి రోడ్లపై వదలకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– భట్టిప్రోలు

రోడ్డుప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

వేమూరు: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఏడుకొండలు ఈనెల 20న రాత్రి కార్యాలయం నుంచి తెనాలికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జంపని సినిమా హాల్ వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ఏడుకొండలు తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో ఆయనను తెనాలి ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి గుంటూరు వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రవి కృష్ణ సోమవారం తెలిపారు.

పశువుల ఆస్పత్రిలో పేకాట



వేమూరు : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పేకాట శిబిరాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ భవనాల్లోనూ జూదరులు పేకాట ఆడుతున్నారు. అయినా పోలీసులు పట్టించుకోవడం లేదు. దీనికి ఈ చిత్రమే నిదర్శనం. వేమూరు మండలం చావలి పశువుల ఆస్పత్రి ఆవరణలో గ్రామస్తులు పేకాట ఆడుతున్న దృశ్యమిదీ. రోజూ ఇదే తంతు జరుగుతున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మందుబాబులూ హల్ చల్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

తెనాలిరూరల్: పిల్లల అశ్లీల వీడియోలను చూడటం, డౌన్‌లోడ్ చేయడం నేరం కాదన్న తమిళనాడు హైకోర్ట్ ఉత్తర్వులను సుప్రీంకోర్టు తోసిపుచ్చడం భారత దేశంలో పిల్లలున్న ప్రతి తల్లి తండ్రి గుండెలమీదున్న కుంపటిని దించడమేనని సినీ దర్శకుడు దిలీప్ రాజా అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పోక్సో చట్ట ప్రకారం పిల్లల పోర్న్ వీడియోలు చూడటం డౌన్‌లోడ్ చేయడం నేరమని దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షణీయమన్నారు. చెన్నై హైకోర్టు ఇచ్చిన తీర్పుని సవాల్ చేస్తు ఓ తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. దీనిపై సుప్రీం కోర్టు తీర్పు భారత దేశ ఆచార సాంప్రదాయాలను గౌరవిస్తు పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించినట్టుందన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థులు స్వచ్ఛంద రక్తదానానికి ముందుకు రావాలని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్ర కుమార్ కోరారు. కళాశాలలోని ఎన్‌సీసీ, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రేపల్లె రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. కళాశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్‌లు 30 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె సబ్ డిస్ట్రిక్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, ఎన్‌సీసీ కేర్ టేకర్ బాలగురవయ్య పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీల పరిష్కారానికి కృషి



ఓ మహిళ సమస్యను వింటున్న ఆర్డీవో షారోన్



కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్

ఆర్డీఓ హెలా షారోన్

రేపల్లె రూరల్/కొల్లూరు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్)కు వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీఓ హెలా షారోన్ తెలిపారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం ఏడు అర్జీలు వచ్చాయని, వాటిని అధికారులకు పంపి పరిష్కారానికి కృషి చేస్తామని షారోన్ వివరించారు.

అధికారులు గైర్హాజరు

కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ వెలవెలబోయింది. తహసీల్దార్, డెప్యూటీ తహసీల్దార్ మినహా ఇతర అధికారులు గైర్హాజరయ్యారు. కొద్దిమంది వచ్చినా ఒంటిగంట వరకూ కార్యాలయంలో లేరు. రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లిపోయారు. దీంతో ప్రజలు తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చి అసంతృప్తితో వెనుదిరిగారు. దీనిపై వివరణ అడిగితే ఆన్‌లైన్‌లో గూగుల్ లింక్ ద్వారా అధికారులు హాజరవుతున్నారని రెవెన్యూ వర్గాలు చెప్పడం గమనార్హం.

వరద బాధితులకు సాయం



మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు చెక్కును అందజేస్తున్న రామకృష్ణ పబ్లిక్ స్కూల్ ప్రెసిడెంట్ కుర్రా మహేష్

రేపల్లెరూరల్/భట్టిప్రోలు: ఇటీవల సంభవించిన వరదల వల్ల నిర్వాసితులైన బాధితులను ఆదుకునేందుకు పట్టణంలోని రామకృష్ణ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం, విద్యార్థులు చేయూతనందించారు. యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి సమకూర్చిన రూ.లక్ష చెక్కును పాఠశాల ప్రెసిడెంట్ డాక్టర్ కుర్రా మహేష్ సోమవారం పట్టణంలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందజేశారు.

ఏపీసీపీఎస్ఈఏ ఆధ్వర్యంలో..

ఆంధ్ర ప్రదేశ్ సీపీఎస్ ఉద్యోగుల సంఘం (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో సోమవారం భట్టిప్రోలు మండలం పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వరద బాధిత ప్రాంతాల విద్యార్థులు 50 మందికి బ్యాగ్‌లు, నోట్ పుస్తకాలు, స్టేషనరీ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్‌కే మహబూబ్ బాషా, ఏపీసీపీఎస్ఈఏ బాపట్ల జిల్లా అధ్యక్షులు గుర్రం మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు. వెల్లటూరుకు చెందిన వాసవీ క్లబ్ పూర్వాధ్యక్షులు నంబూరు అమరనాథ్ మణికంఠ మిత్ర బృందం, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పెదలంక, జువ్వలపాలెం, కిష్కిందపాలెం గ్రామాలలోని 100 కుటుంబాలకు విద్యుత్ సామగ్రి అందజేశారు. క్లబ్ అధ్యక్షులు నాగళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.



పెసర్లంక హైస్కూల్‌లో విద్యార్థులకు బ్యాగ్‌లు, స్టేషనరీ అందజేస్తున్న దృశ్యం

విత్తనాలు ఎరువుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు



ఎరువుల దుకాణ యజమానికి సూచనలిస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ విజయ్‌బాబు

రేపల్లె రూరల్: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల్లో నాణ్యత లోపిస్తే సహించేదిలేదని ఇన్‌చార్జ్ ఏడీఏ ఆర్.విజయ్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలలో సోమవారం ఆయన తనిఖీలు నిర్వహించారు. దుకాణాల యజమానులకు సూచనలు చేశారు. రికార్డులను, స్టాక్ బోర్డులను పరిశీలించారు. నిబంధనల మేరకు వ్యాపారం చేసుకోవాలని చెప్పారు. ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన సోమవారం పట్టణంలోని 13వ వార్డులో జరిగింది. సీఐ మల్లికార్జునరావు కథనం మేరకు 13వ వార్డులోని శ్రీభగవాన్ సత్యసాయి హైస్కూలు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2,320 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ చెప్పారు.



ఆటోలో వెనుక భాగంలో నిలుచుని ప్రయాణిస్తున్న వ్యక్తి



వెల్లటూరు-పెనుమూడి రోడ్డులో ఆటో డ్రైవర్ సీటు పక్కన కింద కూర్చొని వేలాడుతున్న వ్యక్తి

'ఆటో'పాట్లు

సమయానికి గమ్యస్థానాలకు చేరాలనే భావనతో కొందరు ప్రయాణికులు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఆటోల్లో విన్యాసాలు చేస్తూ ఇలా ప్రయాణిస్తున్నారు. పరిమితికి మించి మనుషులను ఎక్కించకూడదన్న నిబంధన ఉన్నా ఆటో డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇలాంటి చిత్రాలు భట్టిప్రోలు మండలంలో నిత్యం తారసపడుతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు.

– భట్టిప్రోలు

30న తెనాలిలో డాక్ అదాలత్

తెనాలి: పోస్టల్ రీజినల్ కార్యాలయం, విజయవాడ ఉత్తర్వుల మేరకు ఈనెల 30వ తేదీన తెనాలిలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్టయితే ఆరోజు ఉదయం 11 గంటలకు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. హాజరయ్యేందుకు వీలుపడనివారు తమ ఫిర్యాదుల లేఖలను ఈనెల 27వ తేదీలోగా పోస్టాఫీస్ సూపరింటెండెంట్, తెనాలి డివిజన్, తెనాలి-522 201 చిరునామాకు పంపాలని కోరారు.